

రక్త చారికలు!

పండుగ పూట పట్టణంలోని వేరువేరు ప్రాంతాల్లో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు.

8లో▸



గ్రేటర్‌పై కాంగ్రెస్ గురి?

గ్రేటర్ పరిధి లోక్‌సభ స్థానాలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. ఎన్నికల్లో మూడింటిని దక్కించుకునేందుకు వ్యూహ పన్నింది.

8లో▸



'మూసీ'పై ముందుకే..

కొత్త ప్రభుత్వం వచ్చాక ఏ పనులు చేయాలో, ఏమి ఆపాలో తెలియక జీహెచ్ఎంసీ అధికారులు అయోమయంలో పడ్డారు.

8లో▸

న్యూస్‌రీల్

క్రీడా స్ఫూర్తితో సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి చరమందరాజు

ఆమనగల్లు: యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విజిలెన్స్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. ఆమనగల్లు ప్రీమియర్ లీగ్ పేరుతో పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. మొదటి బహుమతి సాధించిన జీకే వారియర్స్ జట్టుకు షీల్డ్‌తో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాపిశెట్టి రాము, గుమ్మకొండ రాజు, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

బెదిరించి డబ్బులు లాక్కున్న నలుగురికి రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వ్యక్తులను అడ్డగించి, డబ్బులు లాక్కుంటున్న నలుగురు సభ్యులున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలో నివాసం ఉండే సావల్‌రాం అనే వ్యక్తి ఔటర్ సమీపంలోని తన పాన్ షాప్‌ను బంద్ చేసి.. ఈ నెల 13న రాత్రి 11గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. తారా కన్వెన్షన్ వద్దకు చేరుకోగానే నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారు. అతన్ని బెదిరించి రూ.8 వేలు లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకున్నారు. వీరిలో పెద్దఅంబర్‌పేట కళానగర్‌కు చెందిన ఆలేటి దుర్గాప్రసాద్, సిరిగిరి మధు, గగనం రవీందర్, మోతె శ్రీనివాస్ ఉన్నట్లు గుర్తించి, న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు. అనంతరం నలుగురిని రిమాండ్‌కు తరలించారు.

నియామకం

బంట్వారం: తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగబలిజ యూత్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూర్‌కి చెందిన చాట్ల రాకేష్ నియమితులయ్యారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం పెద్దల చేత ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బంట్వారంలో రాకేష్ మాట్లాడారు. సంఘం పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు.

సర్కారు భూములకు రక్షణ కరువు!

- యాచారం మండలంలో రూ.కోట్లు విలువ చేసే స్థలాలు అన్యాక్రాంతం
- ఆక్రమణలను అడ్డుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలం
- నకిలీ సర్టిఫికెట్లతో 'ధరణి' హక్కులు పొందిన అక్రమార్కులు



మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి 127లో అధికారులు గుర్తించిన అక్రమ నిర్మాణం

యాచారం: మండల పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. రూ.కోట్లు విలువ చేసే సర్కారు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. రెవెన్యూ అధికారుల అండదండలతో నకిలీ సర్టిఫికెట్లు సృష్టిస్తున్న అక్రమార్కులు తమ పేర్ల మీద పట్టాదారు, పాసు పుస్తకాలు పొందుతున్నారు. మహానగరానికి కూత వేటు దూరంలో ఉంది యాచారం మండల కేంద్రం. ఇక్కడి పలు గ్రామాల్లో భూముల ధర ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లకు పైగానే పలుకుతోంది. పెద్ద పెద్ద కంపెనీల ఏర్పాటు, పలువురు ప్రముఖులు ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు కొనుగోలు చేయడంతో డిమాండ్ బాగా పెరిగింది. ఇందులో భాగంగానే నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, అయ్యవారిగూడ, యాచారం, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రేట్లు ఆకాశన్నంటడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. రికార్డుల్లో వందలాది ఎకరాలున్నట్లు కనిపిస్తుంది.. కానీ కబ్జా మాత్రం ఉండదు. నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి, చింతుల్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మాల్, నల్లవెల్లి తదితర గ్రామాల్లో రియల్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూముల పక్కనే వెంచర్లు ఏర్పాటు చేయడంతో పాటు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఆయా గ్రామాల్లోని పంచాయతీ సభల్లో ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే లేకుండాపోయారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల అండదండలతోనే.. ధరణి పోర్టల్ రాకముందు అక్రమార్కులు నకిలీ సర్టిఫికెట్లు సష్టించి తమ పేర్లపై పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు.

కళ్ల ముందే కనిపిస్తున్నా..

అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారంలో ప్రభుత్వ భూమి పక్కనే వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని గతంలో జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. మొండిగౌరెల్లి సర్వే నంబరు 68లో మొత్తం 788.20 ఎకరాల ప్రభుత్వ ఉంది. ఇందులో 203.16 ఎకరాలను పేదలకు అసైన్డ్ చేశారు. ప్రస్తుతం 585.04 ఎకరాల మిగులు భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తే భూమి లేదు. మిగులు భూమి ఆధారంగా అప్పట్లో 300 ఎకరాల్లో సెంట్రల్ జైలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే చేయించారు. రికార్డుల్లో ప్రభుత్వ భూమి ఉండగా.. కబ్జాకు మాత్రం లేదని తేల్చారు. దీంతో జైలు నిర్మాణాన్ని రద్దు చేసుకున్నారు. సర్వే నంబరు 127లో అక్రమార్కులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేసినా.. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. సాగర్‌రోడ్డు పక్కనే మాల్‌లోని సర్వే నంబరు 640లో రూ.50 కోట్లకు పైగా విలువ చేసే 16.37 ఎకరాల భూమికి రక్షణ లేకుండాపోయింది. అధికారులు నామమాత్రంగా కంచె ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. నల్లవెల్లిలోని సర్వే నంబరు 45లో దాదాపు 30 ఎకరాలకు పైగా నకిలీ డాక్యుమెంట్లు కలిగినవేననే ఆరోపణలున్నాయి. అప్పట్లో వీరికి సహకరించిన ఓ రెవెన్యూ అధికారిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

శాశ్వత కంచెలతో రక్షణ

మహానగరానికి దగ్గర(40 కిలోమీటర్ల దూరం)లో సాగర్ రోడ్డుకు ఇరుపక్కలా యాచారం మండల కేంద్రం విస్తరించి ఉంది. మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్దలోని దాదాపు 4 వేల ఎకరాలకుపైగా ప్రభుత్వ, అసైన్డ్ భూమిని అప్పటి కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీ (ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది)కి సేకరించింది. మొండిగౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమికి శాశ్వత కంచెలు ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తే ఆక్రమణలకు అవకాశం ఉండదు. నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతపట్ల, మాల్, చింతుల్ల, కుర్మిద్ద, యాచారం, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో రియల్ వ్యాపారులు వందలాది ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, అటవీ భూములు, చెరువులు, కుంటల పక్కనే వెంచర్లు ఏర్పాటు చేసి కబ్జాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు అందినా అధికారుల్లో స్పందన లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేసీఆర్ సర్కార్ వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడే వారే లేకుండాపోయారు.



మాల్‌లోని సర్వే నంబరు 640లో ప్రభుత్వ భూమికి నామమాత్రంగా వేసిన కంచె

శాశ్వత కంచె నిర్మించాలి



మాల్ గ్రామంలోని సర్వే నంబరు 640లో 16.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వరుస ఫిర్యాదుల నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం దీనికి కంచె ఏర్పాటు చేశారు. కానీ కబ్జాలను ఇది ఆపే పరిస్థితి లేదు. రాతి కట్టడంతో నిర్మిస్తేనే ఆక్రమణలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ఏటా కొంత భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతోంది.

– పడకంటి కవిత, సర్పంచ్, మాల్

చర్యలు తప్పవు



ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవు. రక్షణ కంచె ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు కోసం నివేదికలు పంపిస్తాం. వ్యాపారులు నిబంధనల ప్రకారమే వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణ, చెరువులు, కుంటల శిఖం భూములను కబ్జా చేసినట్లు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ యాచారం

కిరాతకం

- భార్యను హతమార్చి తల, మొండెం వేరుచేసిన భర్త
- అనుమానం, కుటుంబ కలహాలతో దురాగతం
- అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఘటన
- రెండు నెలలక్రితం నుంచి విడిగా ఉంటున్న దంపతులు



పుష్పవతి (ఫైల్)



నిందితుడు విజయ్ కుమార్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: అనుమానంతో పాటు కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను అతి కిరాతకంగా హత్యచేశాడు. తల, మొండెం వేరు చేశాడు. ఈ దుర్ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌కు చెందిన విజయ్‌కుమార్, పుష్పవతి (41) దంపతులు. వీరి మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దీంతో రెండు నెలల క్రితం పుష్పవతి తన కూతురుతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 5/13 బ్లాక్‌లో నివాసముంటోంది. తన కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి ఎల్‌బీనగర్‌లో ఉంటున్న విజయ్‌కుమార్ అప్పుడప్పుడు భార్య, కూతురు వద్దకు వస్తుండేవాడు. ఈ క్రమంలో జేఎన్ఎన్‌యూఆర్ కాలనీకి ఆనుకుని.. ప్రభుత్వం నిర్మించిన నూతన భవన సముదాయంలోని 66/7 బ్లాక్‌లో తన సోదరికి ఇల్లు వచ్చిందని భార్యకు చెప్పాడు. ఆ ఇంటిని శుభ్రం చేసి వద్దామంటూ మంగళవారం పుష్పవతి వద్దకు చేరుకున్నాడు. అక్కడికి తీసుకెళ్లిన తర్వాత ముందస్తు పథకం ప్రకారమే వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో పొడిచి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా తల, మొండెం వేరుచేసి పరారయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం బాడీని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా.. మధ్యాహ్నం 2.30గంటలకు సంఘటన జరిగిన వెంటనే పురాణాపూల్‌లో ఉండే పుష్పవతి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇవ్వగా.. రాత్రి వరకు కూడా రాలేదు. దీంతో మృతురాలికి తన తల్లిదండ్రులతో సత్సంబంధాలు లేనట్లుందని పోలీసులు పేర్కొన్నారు. విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

గోనె సంచిలో వ్యక్తి మృతదేహం

- కాళ్లు, చేతులు కట్టేసి, మూతికి ప్లాస్టర్ వేసిన హంతకులు
- ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కన మృతదేహం
- పోలీసులకు సమాచారం అందించిన మున్సిపల్ సిబ్బంది
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతుడి మెడలో లభించిన చైన్

ఇబ్రహీంపట్నం: ఓ వ్యక్తిని అత్యంత కిరాతంగా హత్య చేసి, గోనె సంచిలో కుక్కి.. ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు పక్కన పడేశారు. ఈ ఘటన మంగళవారం ఆదిబట్ల పీఎస్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అనుమానాస్పదంగా ఉన్న గోనె సంచి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన మున్సిపల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బస్తాను విప్పి చూశారు. దాదాపు 35 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి, మూతికి ప్లాస్టర్ వేసిన శవం కనిపించింది. మృతుడి శరీరంపై నలుపు రంగు షర్ట్, టీషర్ట్ ఉన్నట్లు గుర్తించారు. మెడలో బంగారు చైన్, కుడికాలుకు నలుపు దారం, కుడి చేతికి కడియం ధరించి ఉన్నాడు. మృతుడి వయస్సు 35 ఏళ్లకు పైబడి ఉంటుందని.. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసినట్లు భావిస్తున్నామని చెప్పారు. సంఘటన స్థలాన్ని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. మృత దేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

రూ.17వేల కోట్లతో టూరిజం అభివృద్ధి

- పర్యాటక కేంద్రంగా అనంతగిరిగుట్ట
- కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి సహకరిస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ధారూరు: ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ధారూరు: దేశంలో రూ.17వేల కోట్లతో టూరిజం రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును సోమవారం ఆయన సందర్శించారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి బోటింగ్ చేశారు. అనంతరం టేకు ఆకులతో చేసిన ప్రత్యేక టోపీని ధరించి పర్యాటకులను ఉత్తేజపర్చారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పర్యాటకరంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా డొమెస్టిక్ టూరిజాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో దాదాపు 170 దేశాల నుంచి పర్యాటకులు భారతదేశంలో పర్యటించారన్నారు. తెలంగాణలో ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో ఎకో టూరిజం, వరంగల్‌లో ట్రైబల్ టూరిజం, రామప్ప దేవాలయానికి ప్రపంచ గుర్తింపు వంటి వాటికి కృషి చేశామన్నారు. పోచంపల్లి గ్రామాన్ని ప్రపంచ బెస్ట్ టూరిజంగా చేశామన్నారు. అడవి పచ్చదనం మధ్యలో ఉన్న అనంతగిరి గుట్టను టూరిజం హబ్‌గా చేయడానికి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్ ఫైనల్ స్టేజీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కూడా ఇచ్చిందన్నారు. వెంటనే టెండర్ పెడుతామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేయడం చాలా మంచి అనుభూతిని కలిగించిందని అన్నారు.ప్రాజెక్టు అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. టూరిజం రంగంలో ప్రైవేట్ సెక్టార్‌ను ప్రోత్సహించి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేకేఎంఆర్ బోటింగ్ కన్వీనర్ రాములు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సదానందారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ పాల్గొన్నారు.

అనంతుని సేవలో కేంద్రమంత్రి..

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభస్వామిని సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. పెద్దముల్ మండలం చైతన్యనగర్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన మార్గమధ్యలో అనంతగిరిగుట్టలో ఆగి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ నరేందర్, ధర్మకర్త పద్మనాభం.. కిషన్‌రెడ్డికి స్వామివారి ప్రతిమ అందజేసి ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి స్థలం కేటాయించాలని, నిధులు మంజూరు చేయాలని కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవరెడ్డి, శివరాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

చెంచు కుటుంబాల్లో నిజమైన సంక్రాంతి



పెద్దేముల్: చెంచు కుటుంబాల్లో నిజమైన సంక్రాంతిని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి జన్‌మన్' కార్యక్రమంతో చేయూతనందిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలంలోని చైతన్యనగర్‌లో సోమవారం ఉదయం పీఎం జన్‌మన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని కిషన్‌రెడ్డి.. రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన, చెంచు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లతో ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గిరిజన తెగలకు చెందిన లక్ష కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 468 గ్రామాలను ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా దాదాపు 55వేల మంది గిరిజన చెంచులకు లబ్ధి చేకూరుతుందన్నారు. చెంచులు, గిరిజనుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా జాబ్‌మేళాలను నిర్వహించి అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జెడ్పీటీసీ ధారాసింగ్, మండల ఎంపీపీ అనురాధ, వైస్ ఎంపీపీ మధులత, గ్రామ సర్పంచ్ లలిత, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత: జేటీసీ రమేశ్

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ జేటీసీ రమేశ్ అన్నారు. వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నియంత్రించవచ్చన్నారు. 'ముందుగా బయలుదేరు.. క్షేమంగా గమ్యం చేరు' అనే నినాదంతో ఈ ఏడాది చేపట్టిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేటీసీ రమేష్ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ప్రాంతీయ రవాణా అధికారులు, ఎంవీఐలు, ఏఎంవీఐలు, కానిస్టేబుళ్లు, వందలాది మంది విద్యార్థులు, డ్రైవర్‌లు, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జేటీసీ మాట్లాడుతూ.. పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపరాదని సూచించారు. మద్యం తాగి నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్‌టేక్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలస్యంగా బయలుదేరి వేగంగా బండి నడిపి ప్రమాదాలకు గురికావడం కంటే ముందుగా బయలుదేరి క్షేమంగా గమ్యానికి చేరుకోవడం ముఖ్యమని చెప్పారు. ఫిబ్రవరి 14 వరకు కొనసాగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, డ్రైవర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఇతర అన్ని వర్గాలకు చెందిన వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందిస్తామన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని కోరారు.

'సంక్షేమం'తోనే అభివృద్ధి

- అర్హులైన ప్రతీ పౌరుడికి ప్రభుత్వ పథకాలు అందాలి
- ఆదివాసీల అభ్యున్నతికి కేంద్రం కట్టుబడి ఉంది
- 'జన్‌మన్' లబ్ధిదారుల వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ



కడ్తాల్: చెంచు లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్, గురుకుల కార్యదర్శి నవీన్ నికోలస్, జిల్లా కలెక్టర్ శశాంక

కడ్తాల్: దేశంలోని అర్హులైన ప్రతీ పౌరుడికి సంక్షేమ పథకాలు అందినప్పుడే అసలైన అభివృద్ధి జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రధాన మంత్రి జనజాతి న్యాయ్ మహా అభియాన్(పీఎం జన్‌మన్) పథకం లబ్ధిదారులైన ఆదివాసీలతో సోమవారం ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కడ్తాల్ గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన 11 గ్రామాల చెంచు ప్రజలు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా రూ.540 కోట్లు

దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల ఆదివాసీల సంక్షేమానికి, సంక్రాంతి కానుకగా పీఎం జన్‌మన్ పథకం కింద లక్ష మందికి ప్రయోజనం చేకూర్చేలా ప్రధాని మోదీ (రూరల్ డెవలప్‌మెంట్ స్కీం కింద) తొలి విడతగా రూ.540 కోట్లు విడుదల చేశారు. అనంతరం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , ఏపీ, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన లబ్ధిదారులతో మాట్లాడారు. వారి జీవన శైలి, కుటుంబ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గడిచిన పదేళ్లలో ఆదివాసీలకు ఇస్తున్న సంక్షేమ పథకాల మొత్తాన్ని పది రెట్లకు పెంచామని తెలిపారు. గిరిజన, ఆదివాసీ సమూహాల ఆర్థిక సంక్షేమం కోసం దాదాపు రూ.24 వేల కోట్లు వెచ్చించామని వివరించారు. ఇళ్లు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్, టెలికాం సేవల కోసం ఈ నిధులు ఖర్చు చేశామని స్పష్టంచేశారు. ఆదివాసీల అభ్యున్నతికి కేంద్రం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం జన్‌మన్ లబ్ధిదారులకు ఉన్నతాధికారులు పథకం కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్, గురుకుల కార్యదర్శి నవీన్ నికోలస్, కలెక్టర్ శశాంక, డీఆర్‌డీవో ప్రభాకర్‌రావు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీటీడీవో రామేశ్వరిదేవి, ఆర్డీవో సూరజ్‌కుమార్, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, తహసీల్దార్లు ముంతాజ్, లలిత ఎంపీడీవోలు రామకృష్ణ, ఫారుఖ్ హుస్సేన్, డీఈ తిరుపతి, ఏడీఏ సుజాత, సీడీపీవో సక్కుబాయి, నోడల్ అధికారి జంగయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. కత్తిపోట్లు, ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో రక్తపు మడుగులో విలవిల్లాడుతూ ప్రాణాలొదిలారు. పచ్చి మాంసం తింటున్నావెందుకని ప్రశ్నించిన పాపానికి చిలకలగూడ తుకారాంగేట్ పరిధిలో ఓ సైకో కత్తితో దాడి చేసి ఒకరిని చంపేశాడు. తన ప్రేమను కాదన్నందుకు ఓ యువకుడు సన్నిహితురాలి భర్తను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన ఫిలింనగర్‌లో చోటుచేసుకోగా.. ఇనుప చువ్వల దొంగతనం వివాదం కారణంగా వాచ్‌మన్‌ను తాపీ మేస్త్రీ ఇనుప రాడ్డుతో కొట్టి ప్రాణం తీశాడు. పండగ పూట మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిన ఆయా ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి..

– చిలకలగూడ/బంజారాహిల్స్/మణికొండ

రక్త చారికలు!

కత్తులు, ఇనుప రాడ్డుతో దాడి

- వేర్వేరు చోట్ల ముగ్గురి దారుణ హత్య
- చిలకలగూడ, బంజారాహిల్స్, మణికొండ పరిధుల్లో ఘటనలు
- పండగ పూట తీవ్ర విషాదం



పచ్చి మాంసం తింటున్నావన్నందుకు..



తుకారాంగేట్ గోల్‌బావి ప్రాంతానికి చెందిన కాంబ్లే అజయ్ (23) బ్యాండ్ మేళం పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య ప్రియాంక, ఎనిమిది నెలల కుమార్తె అక్షిత ఉన్నారు. ఈ నెల 15న (సోమవారం) ఉదయం అజయ్, ప్రియాంక బయటకు వెళ్తున్నారు. బస్తీలో కేబుల్ కలెక్షన్ బాయ్‌గా పని చేస్తున్న అక్కెనపల్లి శ్రీనివాసాచారి (25) ఆరుబయట కూర్చుని పచ్చి మాంసంతో అన్నం తింటున్నాడు. వండుకుని తినవచ్చు కదా, పచ్చిమాంసం ఎందుకు తింటున్నావని అజయ్ మందలించాడు. కొంతకాలంగా ఉన్మాదిలా వ్యవహరిస్తున్న శ్రీనివాసాచారి తీవ్ర ఆగ్రహావేశాలతో 'నా ఇష్టం వచ్చినట్లు తింటా'నంటూ అజయ్‌తో వాగ్వాదానికి దిగాడు. పచ్చిమాంసం తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయంటూ సర్ది చెప్పేలోగా ఆవేశానికి గురైన శ్రీనివాసాచారి అక్కడే ఉన్న కూరగాయలు కోసే కత్తితో అజయ్, ప్రియాంకలపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయాల పాలైన అజయ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ప్రియాంక స్వల్పంగా గాయపడింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసాచారి ఉన్మాదిలా మారి బస్తీవాసులను భయభ్రాంతులకు గురిచేసున్నాడని స్థానికులు తెలిపారు. మహంకాళి ఏసీపీ రవీందర్ యాదవ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దొంగతనం బయటపెట్టాడని..



మృతుడు జంగయ్య

పని చేస్తున్న చోట దొంగతనంగా ఇనుప చువ్వలు అమ్ముకుంటున్న విషయాన్ని ఇంటి యజమానికి చెప్పాడనే కోపంతో వాచ్‌మన్‌ను హత్య చేశాడు ఓ తాపీ మేస్త్రీ. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మణికొండ పరిధిలోని మంచిరేవులలో ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. అతని గ్రామానికే చెందిన జంగయ్య అనే వ్యక్తిని అక్కడ వాచ్‌మన్‌గా నియమించుకున్నాడు. నిర్మాణంలో ఉపయోగించే ఇనుపు చువ్వలు, స్క్రాప్‌ను అక్కడే పని చేస్తున్న అర్జున్ అనే తాపీ మేస్త్రీ అమ్ముకున్నాడు. ఈ విషయాన్ని వాచ్‌మన్ జంగయ్య ఇంటి యజమానికి చెప్పడంతో తాపీమేస్త్రీని మందలించాడు. దీంతో జంగయ్యపై అర్జున్ కోపం పెంచుకున్నాడు. సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగి అదే విషయంలో గొడవపడ్డారు. వాచ్‌మన్ నిద్రపోయిన తర్వాత అర్జున్ పదునైన రాడ్‌తో జంగయ్య తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు నార్సింగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

ప్రేమకు అడ్డొస్తున్నాడని..

తన ప్రేమను కాదంటున్నాడని పక్కా పథకంతో లండన్ నుంచి వచ్చిన ఓ యువకుడు తన సన్నిహితురాలి భర్తను దారుణంగా హత్య చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. షేక్‌పేట సమీపంలోని జైహింద్‌నగర్ కాలనీలో నివసించే గౌస్ మొహినుద్దీన్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి దుబాయ్‌లో మూడేళ్ల పాటు పనిచేశాడు. ఇటీవలే నగరానికి వచ్చి భార్యాపిల్లలతో ఉంటున్నాడు. ఆయన భార్య మీనా రూహీ 2002 ఫిబ్రవరిలో ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లింది. మూడు నెలలకే ఆమె భర్త గౌస్ మొహినుద్దీన్ కూడా ముగ్గురు పిల్లలను తీసుకుని లండన్ వెళ్లి ఆమెతో పాటు కొన్నాళ్లు ఉన్నారు. పిల్లల ఆరోగ్యం బాగా లేకపోవడంతో.. గౌస్ తన ముగ్గురు పిల్లలను తీసుకుని నగరానికి వచ్చారు. భార్య మీనా లండన్‌లో ఉంది. ఆ సమయంలో హైదరాబాద్‌కు చెందిన అద్నాన్ హుస్సేన్ (26)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. తనను పెళ్లి చేసుకోవాలని మీనా రూహీని బలవంతం పెడుతుండడంతో ఆమె హైదరాబాద్‌కు తిరిగివచ్చింది. గత నవంబర్ 14న అద్నాన్‌పై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అద్నాన్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అయితే.. మీనాను తనతో పాటు తీసుకెళ్లాలని పక్కా పథకంతో అద్నాన్ లండన్ నుంచి నగరానికి వచ్చాడు. ఇందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఒకరి జోలికి మరొకరు వెళ్లవద్దని ఒప్పందం చేసుకుని వీడియో రికార్డింగ్ కూడా చేసుకున్నారు. కాగా.. ఈ నెల 14న రాత్రి గౌస్ మొహినుద్దీన్ తన భార్య, ముగ్గురు పిల్లలను తీసుకుని పుప్పాలగూడలో ఓ విందుకు హాజరై రాత్రి 9 గంటల ప్రాంతంలో బైక్‌పై తన ఇంటికి వచ్చాడు. అప్పటికే అక్కడ వేచి ఉన్న అద్నాన్ బలవంతంగా ఇంట్లోకి వెళ్లి మీనా రూహీని తనతో పాటు బలవంతంగా తీసుకువెళ్లేందుకు యత్నించగా ఆమె భర్త గౌస్ అడ్డుకున్నాడు. దీంతో తనతో పాటు తెచ్చుకున్న కత్తితో అద్నాన్ ఆగ్రహంతో ఊగిపోతూ గౌస్ గుండెపై గట్టిగా పొడిచాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే గౌస్ మృతి చెందాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



మృతుడు గౌస్‌మొహినుద్దీన్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత పోలీస్ అధికారులకు డీజీపీ రవిగుప్తా మంగళవారం పలు సూచనలు చేశారు. విజిబుల్ పోలీసింగ్ అమలు, ట్రాఫిక్ సిబ్బందికి ఆధునిక శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితిపై సీనియర్ పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ఇంటిలిజెన్స్ చీఫ్ బి.శివధర్ రెడ్డి, అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ఐజీ తరుణ్ జోషి పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త స్కైవాక్‌లు, ఫ్లైఓవర్‌ల చుట్టూ ట్రాఫిక్ పరిస్థితులను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ నది ప్రాంతంలో వంతెనల పరిస్థితి, ప్రతిపాదిత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమా లు, శిక్షణా కేంద్రం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. సిఫార్సుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

చేవెళ్ల/మొయినాబాద్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎస్టీఎఫ్ నాయకులు విన్నవించారు. మంగళవారం వారు సెక్రెటేరియట్‌లో భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య, ప్రధాన కార్యదర్శి డి.సైదులు, జిల్లా అధ్యక్షుడు జనార్ధనాచారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, చేవెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శులు రాంచంద్రయ్య, రమేశ్, సుధాకర్, శ్రీనివాస్, సంతోశ్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రేటర్‌పై కాంగ్రెస్ గురి

- లోక్‌సభ ఎన్నికలకు అంతా సన్నద్ధం
- రంగంలోకి దిగిన దీపా దాస్‌మున్షీ
- నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- నాలుగింటిలో మూడు స్థానాలు ప్రతిష్టాత్మకం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని లోక్‌సభ స్థానాలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో నాలుగింటిలో కనీసం మూడింటిని దక్కించుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఏకంగా ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ రంగంలోకి దిగారు. మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మైనారిటీ వర్గాలతో సమావేశం నిర్వహించి చర్చించారు. కాగా.. ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రులు, ముఖ్య నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లేలా అధిష్టానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించిన కారణంగా.. పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగకుండా ముందు జాగ్రత్తలకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే టీపీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను కూడా నియమించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిలకు రెండేసి నియోజకవర్గాల బాధ్యతలను, మిగిలిన వారికి ఒక్కో నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి గ్రేటర్ పరిధిలోని చేవెళ్ల స్థానంతో పాటు మరో నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సికింద్రాబాద్, హైదరాబాద్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా నియమించారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు బాధ్యతలు అప్పగించారు.

ప్రభంజనంలో.. పరాభావం

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగినా... మహానగర పరిధిలోని అన్ని స్థానాల్లో పరాభావం తప్పలేదు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం గత పదేళ్లుగా అసెంబ్లీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పరాభావానికి గురవుతూ వస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం నిరాశ పర్చాయి. లోక్‌సభ స్థానాల వారీగా పరిశీలిస్తే వాటి పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంటల్లో సైతం ఓటు సాధించడంలో పూర్తిగా వెనుకబడింది. పలు సెగ్మెంటల్లో మూడో స్థానానికి పరిమితమైంది.

పార్టీ వీడిన వారికి పచ్చజెండా

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జోష్‌తో రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో నాలిగింటిలో మూడింటిని క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. తాజాగా.. గతంలో పార్టీ వీడిన వారిని తిరిగి చేర్చుకొని లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. ఇండియా కూటమిలో ఎంబీటీ చేరితే దానికి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం వదిలి మిగతా స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకోసం సీనియర్ నాయకులైన మంత్రులకు ప్రాధాన్యత ఇచ్చి పార్లమెంట్ స్థానాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. సామాజిక సమీకరణలు, గతంలో పని చేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని చర్యలకు ఉపక్రమించింది.

ప్రతిష్టాత్మకమే..

గ్రేటర్ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. మొత్తం నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో మూడింటిలో పాగా వేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. వాస్తవంగా నాలుగు నియోజకవర్గాల్లోని మొత్తం 29 అసెంబ్లీ సెగ్మెంట్లలకు కేవలం మూడింటిలో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉండగా, మిగతా సెగ్మెంట్లకు బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం వహిస్తోంది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో గోషామహల్ (బీజేపీ) మినహా మిగతా వాటిలో మజ్లిస్ ప్రాతనిధ్యం కలిగి ఉంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం ఉండగా, చేవెళ్ల పరిధిలో కేవలం మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉంది. మిగతా సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం కలిగి ఉంది. అయితే అధికార కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.

క్లుప్తంగా

20న ఎమ్మెల్యే కూనంనేనికి అభినందన సభ



మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

షాద్‌నగర్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకుగాను ఈనెల 20న అభినందన సభ నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పర్వతాలు మాట్లాడుతూ... కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసిన సాంబశివరావు అఖండ విజయం సాధించారన్నారు. పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్డులో ఉన్న వీ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు అభినందన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుద్దుల జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

కారు మాత్రమే నీది.. రోడ్డు కాదు!

- భారీ శబ్దాలపై యువకుడి ట్వీట్
- కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: సంక్రాంతి పండగ సందర్భంగా చాలామంది సొంతూళ్లకు వెళ్లడంతో నగర రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఇంకేముంది.. పలువురు బడాబాబులు ఖరీదైన కార్లు, బైక్‌లకు పని చెప్పారు. సైలెన్సర్లు మార్చి భారీ శబ్దాలతో రోడ్లపై వేగంగా దూసుకెళ్తూ ఇతరులను ఇబ్బందులకు గురిచేశారు. ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1 నుంచి లాంబోర్గిని కారు (టీఎస్09 జీడీ 9777)లో ఓ యువకుడు మితిమీరిన వేగంతో, భారీ శబ్దంతో దూసుకెళ్లి న్యూసెన్స్ సృష్టించాడు. ఈ కారును ఓ యువకుడు ఫొటోలు తీశాడు. 'కారు మాత్రమే నీది.. రోడ్డు కాదు' అంటూ ట్వీట్ చేయడంతో వైరల్‌గా మారింది. సోమవారం రోజంతా సోషల్ మీడియాలో ఈ ట్వీట్ చక్కర్లు కొట్టడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. సదరు కారు నడిపిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. లాంబోర్గిని కారును సీజ్ చేయాలని అధికారులను ఆదేశించడంతో పోలీసులు వేట ప్రారంభించారు. ట్వీట్ చూసిన సదరు కారు నడిపిన యువకుడు తన మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంపల్స్'తో వ్యాపార రంగాభివృద్ధి

కీసర: దేశవ్యాప్తంగా సామాజిక వ్యాపార రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా చేపట్టిన సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇంపల్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. బాలవికాస్ సీఎస్ఆర్‌బీ, టీఎస్ఐసీ భాగస్వామ్యంతో ఈ నెల 27న ఘట్‌కేసర్ సమీపంలో ఇంపల్స్ పేరుతో సామాజిక వ్యాపార సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కీసర మండల పరిధిలోని రాంపల్లి దాయరలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. సుమారు వెయ్యి మంది సామాజిక వ్యాపారవేత్తలు, ఇంపాక్ట్ ఇన్వెస్టర్లను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఇకపై ఉంటామంటే చెల్లదు?

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ సర్వీసు నుంచి రిటైరైనా జీహెచ్‌ఎంసీలో వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారికి చేస్తున్నవారికి ఇక ఉద్వాసన తప్పదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు కారణం సెక్రటేరియట్‌తో సహా వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ ఏజెన్సీలు, కార్పొరేషన్లలో రిటైరయ్యాక కూడా కొనసాగుతున్న వారి వివరాలను ఈ రోజు సాయంత్రం ఐదు గంటల్లోగా అందజేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. టాప్ ప్రయారిటీగా ఈ వివరాలు అందజేయాలని ఆమె కోరారు. రీ అపాయింట్‌మెంట్, కాంట్రాక్ట్.. ఔట్‌సోర్సింగ్.. ఇలా ఏ పేరుతో చేరినా సరే సదరు అధికారుల వివరాలు అందించాలని ఆదేశాలలో పేర్కొన్నారు. అంతేకాకుండా గౌరవ వేతనాల పేరిట వారికి ఎక్కడి నుంచి చెల్లింపులు చేస్తున్నారో కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇలా కొనసాగుతున్న వారితో పాటు ఇతర అంశాల వల్ల సంస్థ ఖజానాపై భారం పడుతోందనే అభిప్రాయాలున్నాయి. ఖజానా నుంచి లక్ష రూపాయలకు పైగా వేతనాలతో పాటు కారు లాంటి సదుపాయాలు సైతం జీహెచ్‌ఎంసీ కల్పిస్తోంది. రిటైరైన వారితో పాటు డిప్యూటేషన్లపై వచ్చి జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడిగా కొనసాగుతున్న వారు భారీ సంఖ్యలోనే ఉన్నారు. తాజా చర్యలతో ఇతర విభాగాలతో పాటు జీహెచ్‌ఎంసీలో కొనసాగుతున్న వారికి ఉద్వాసన తప్పక పోవచ్చని సమాచారం.

చిక్కుకున్న గాలిపటాన్ని తీస్తూ..

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీయడానికి ప్రయత్నిస్తూ.. కరెంట్ షాక్ తగిలి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కాటేదాన్ గణేశ్‌నగర్ ప్రాంతానికి చెందిన సంతోశ్, స్రవంతి దంపతులకు వివేక్(9) కుమారుడు. సంక్రాంతి రోజున గాలిపటం ఎగురువేసేందు ఇంటి పైకి వెళ్లాడు. అయితే, ఓ గాలిపటం విద్యుత్ హైటెన్షన్ వైర్లకు చిక్కుకొని ఉండటంతో ఇనుప చువ్వతో దాన్ని తీయడానికి వివేక్ యత్నించాడు. దీంతో కరెంటు షాక్ తగిలి కిందకు పడిపోయాడు. స్థానికులు వెంటనే బాలుడిని శివరాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. దీంతో గణేశ్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఈశ్వర్ ప్రసాద్ చేరుకొని ఘటన స్థలిని పరిశీలించారు.

'మూసీ'పై ముందుకే..

- 4 హైలెవల్ బ్రిడ్జిలకు పీఎంసీలు
- టెండర్లు ఆహ్వానించిన జీహెచ్‌ఎంసీ
- అంచనా వ్యయం రూ.168 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ప్రభుత్వం మారాక ఏ పనులు చేయాలో, ఏవి ఆపాలో తెలియక అయోమయంలో ఉన్న జీహెచ్‌ఎంసీ అధికారులు మూసీ పనులకు సంబంధించి మాత్రం ముందుకు వెళ్లేందుకే సిద్ధమయ్యారు. ముఖ్యంగా.. వరద ముంపు సమస్యల పరిష్కారానికి హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనుల్ని త్వరితంగా పూర్తి చేసే తలంపులో ఉన్నారు. అందుకనుగుణంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్మించాల్సిన నాలుగు హైలెవల్ బ్రిడ్జిల పనులకు ప్రాజెక్ట్ మానిటరింగ్ కన్సల్టెన్సీ (పీఎంసీ)ల కోసం టెండర్లు ఆహ్వానించారు.

గత ప్రభుత్వ హయాంలోనే..

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ), వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ), ఇతరత్రా పథకాలకు సంబంధించిన పనులపై అధికారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. వీటిలో ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో తెలియనందున వాటి జోలికి పోవడం లేదు. జీహెచ్‌ఎంసీలో నిధులు లేకపోవడం కూడా ఇందుకు మరో కారణం. ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో వెల్లడయ్యాకే వాటి విషయంలో ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇదే తరుణంలో మూసీపై హైలెవల్ బ్రిడ్జిల పనులను మాత్రం పూర్తిచేసే యోచనలో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే బ్రిడ్జిల పనులకు అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేశారు.

మూసీకి ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరానికి సంబంధించి నిర్వహించిన సమీక్షల్లో మూసీని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మూసీ పరిసరాల్ని పర్యాటక ఆకర్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మూసీ పనులపై సీఎం శ్రద్ధ చూపుతున్నందున అధికారులు మూసీ బ్రిడ్జి పనులను త్వరితంగా పూర్తిచేసే యోచనలో ఉన్నారు. అందుకుగాను జీహెచ్‌ఎంసీ నిర్మించే నాలుగు హైలెవల్ బ్రిడ్జిల పనుల పర్యవేక్షణకు పీఎంసీలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు.

పీఎంసీల పనేమిటి ?

పీఎంసీ సేవలందించే ఏజెన్సీలు పనుల్ని ఏరోజుకారోజు పర్యవేక్షించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో నిర్మాణం పూర్తయ్యేలా చూడటంతో పాటు ప్రతిరోజూ జరిగిన పనుల్ని రికార్డు చేయాలి. నిర్ణీత ప్రమాణాల మేరకు పనులు జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలి. పనులు నాణ్యతగా ఉండేలా చూడాలి. క్వాలిటీ ఆడిట్ నిర్వహించాలి. ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి అవసరమయ్యే అనుమతులు, క్లియరెన్స్‌లు పొందేందుకు సహకరించాలి. స్థూలంగా చెప్పాలంటే పనులు సకాలంలో, ఎలాంటి లోపాలు లేకుండా, నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలి. ఈ పనుల్ని ఏడాదిలో పూర్తిచేయాలనేది లక్ష్యం. పనులు పూర్తయ్యాక రెండేళ్లపాటు ఎలాంటి లోపాలు తలెత్తినా సరిచేసే బాధ్యత కూడా పీఎంసీదే.

ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లు సైతం

హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలతో పాటు వాటికి సంబంధించిన అప్రోచ్‌లు, సర్వీస్ రోడ్లు, డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లు, డక్ట్‌లు, మీడియన్లు, వీధిదీపాలు వంటి పనులకు కూడా పీఎంసీ సేవలందించాలి.

ఇప్పటికే టెండర్లకు ఆహ్వానం

ఇందుకు రూ.168 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. హైలెవల్ బ్రిడ్జిల వారీగా అంచనా వ్యయం వివరాలిలా ఉన్నాయి.

హైలెవెల్ బ్రిడ్జి	అంచనా (రూ.కోట్లు)
ఇబ్రహీంబాగ్ కాజ్‌వే	39.00
మూసారాంబాగ్	52.00
చాదర్‌ఘాట్	42.00
అత్తాపూర్	35.00
మొత్తం	168.00